ప్రజాశక్తి



ఆదివారం 15 సెప్టెంబరు 2024 8 పేజీలు

శ్రీకాకుళం

మెరుగైన వైద్యం అందించాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వాస్పత్రిపై విశ్వాసం పెంచేలా సేవలు అందించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద నూతన మార్చురీ రూమ్, వేస్టేజ్ స్టోర్ రూమ్ నిర్మాణానికి స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుంచి పనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇంజినీరింగ్ విభాగం అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. వైద్యరంగానికి (మిగతా... 2లో)



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు



సన్మానిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం

ఎస్‌టి జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

షెడ్యూలు తెగల జీవితాలలో వెలుగు నింపడానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కలెక్టరేట్‌లో శనివారం జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌టిల అభివృద్ధికి ప్రభుత్వం ఉద్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులకు ఉపాధి కల్పనకు, వారి ఆదాయాన్ని మెరుగుపర్చడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడం, సరైన శిక్షణ ద్వారా ఎస్‌టిల్లో నైపుణ్యాలను పెంపొందించాలని ఆదేశించారు.

(మిగతా... 2లో)

లోక్ అదాలత్‌కు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

న్యాయమూర్తులు కేసులు రాజీ చేయడంలో ఎంతగానో కృషి చేశారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహమ్మద్ మౌలానా అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సివిల్ కేసులు 121, క్రిమినల్ కేసులు 1477, పిఎల్‌సి 121లు రాజీ అయ్యాయని అన్నారు. రాజీ ద్వారా ఇరు పార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజీయే రాజ మార్గమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని న్యాయమూర్తులు పి.భాస్కరరావు, 3వ అదనపు జిల్లా జడ్జి కె.వి.ల్.హిమబిందు, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, సివిల్ జడ్జి, కె.శారదాంబ, సివిల్ జడ్జి మోహిదిన్ జామరూత్ బేగం కమలుదీన్, ఎజెఎఫ్‌సిఎం జడ్జి, డి.శ్రీభరాణి, పబ్లిక్ ప్రాసెక్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.



కేసులను పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహమ్మద్ మౌనాలా

కొత్తమ్మతల్లి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

కోటబొమ్మాళి: అక్టోబరు ఒకటి నుంచి 3వ వరకు నిర్వహించనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాల ఏర్పాట్లను దేవాదాయ, ధర్మదాయశాఖ ఉపకమిషనర్, అరసవెల్లి సూర్యనారాయణస్వామి ఆలయ కార్య నిర్వాహణాధికారి డి.ఎల్.ఐ. రమేష్‌బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణకు ఉత్సవాల విధివిధాలను, జాతరకు హాజరైన భక్తులకు ఏర్పాట్లు, క్యూలైన్, ఉచిత ప్రసాద్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ధ్రువపత్రాల జారీ సరళతరం చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

విద్యార్థులకు, రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ రకాల ధ్రువపత్రాల జారీ ప్రక్రియను సరళతరం చేయాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షుడు రామ్‌బుడ్డి గణపతి కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి, కలెక్టర్‌కు ఈమెయిల్ ద్వారా శనివారం వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు తరగతి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో, రైతులకు అడంగల్, పాసు పుస్తకాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దీని నివారించడానికి సరళమైన ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని కోరారు.

వైద్యునికి అభినందనలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అన్వేష్

ఇచ్ఛాపురం : వ్యాపారవేత్త కీర్తిశేషులు వల్లంపాటి సుధీర్ కుమార్ కుమార్తె వల్లంపాటి శ్రీరమ్య వైద్య విద్య పూర్తి చేసి విశాఖపట్నంలో ఇండూస్ ఆస్పత్రి వైద్యులుగా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఇచ్ఛాపురానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు. విశాఖ వెళ్లి శ్రీరమ్యకు అభినందించారుర. కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ప్రత్తి అన్వేష్, సూపర్ బజార్ మాజీ చైర్మన్ పోతల ఈశ్వరరావురెడ్డి, మురళి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం తగిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్షలు నిర్వహిస్తూ పేదలు అందించే వైద్యసేవలపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్యులు తమ విధులను మరింత బాధ్యతతో నిర్వహించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం కాకూడదని ఉద్బోధించారు. రోగులను నవ్వుతూ పలకరించాలన్నారు. విధుల్లో ఉదాశీనత ఉండకూడదన్నారు. ఉదాసీనతను ఉపేక్షించేది లేదన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే సరిదిద్దుకోవాలని సూచించారు. ఇటీవల ఆస్పత్రిలో లిఫ్ట్ పనిచేయకపోవడం, రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందని, దానిపై సూపరిండెండెంట్ సూర్యారావును మంత్రి వివరణ కోరగా, అధిక ఒత్తిడికి గురై సుమారు 20 నిమిషాల పాటు పనిచేయలేదని తెలిపారు. మంత్రి తక్షణం స్పందించి భవిష్యత్‌లో ఇటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆస్పత్రికి పక్కనే ఉన్న మత్స్యశాఖ కార్యాలయం దరిలో గోసాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి సరిహద్దులు వేయాలన్నారు. ఈయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సిమ్మన్న, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, టిడిపి మండల నాయకులు బగాది శేషగిరి, కోళ్ల లవకుమార్, మట్ట పురుషోత్తంరావు, హనుమంతు రామకృష్ణ, లాడే శ్రీను, ప్రసాద్‌రెడ్డి, మామిడి రాము పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం

గ్రామ, మండల స్థాయిలోనే ఎస్‌టిల వినతులు, ఫిర్యాదులను పరిష్కరించాలని తెలిపారు. వసతిగృహాల్లో సౌకర్యాలను మెరుగు పర్చాలన్నారు. 2014-19 మధ్య నిర్మించిన వసతిగృహాలకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించాలన్నారు. ఎస్‌టిలకు ఉద్దేశించిన కొన్ని సంస్థల్లో గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించని విషయాన్ని సీరియస్‌గా పరిగణించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల సేమియా, సికిల్ సెల్ ఎనీమియా కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతాలలో రోడ్డు సౌకర్యం లేని గ్రామం రికార్డుల్లో ఉండకూడదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 2014-2019 మధ్య విడుదల కానీ హౌసింగ్ బిల్లుల విషయంలో వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాక్ లాగ్ పోస్టుల భక్తి విషయంలో పారదర్శకత పాటించాలని సూచించారు. గిరిజన సంఘాలు, ఎస్‌టిల వ్యక్తిగత ఫిర్యాదులు, విన్నత్తులపై చర్చించి వాటి పరిష్కారానికి తగు ఆదేశాలు జారీ చేశారు. సమీక్షలో భారత ప్రభుత్వ కార్యదర్శి పెండ్లి కళ్యాణ్‌రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి డైరెక్టర్ ఆర్.ఎస్.మిశ్రా, రీసెర్చ్ ఆఫీసర్ ఆకాష్ త్రిపాఠి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్‌కుమార్ లక్కర్సు, ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. తొలుత జలుమూరు, మెళియాపుట్టి మండలాల్లో పర్యటించారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తా

మెళియాపుట్టి: గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తానని ఎస్‌టి జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. మండలంలోని కేరాసింగి, గూడ గిరిజన గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఇందులో భాగంగా పాఠశాల భవనాలు, అంగన్వాడీ భవనాలు నిర్మించాలని కోరారు. తాగునీరు, రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. గొడ్డ నుంచి ఆంపురం వరకు రోడ్డు వేయాలని, సిసి రోడ్లు నిర్మించాలని విన్నవించారు. మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, కొండలకు గ్రానైట్ అనుమతులు ఇవ్వద్దని గిరిజన సంఘ నాయకులు వాబ యోగి, సవర ఆదినాయుడు, కృష్ణారావు, గౌరీష్ కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.కళ్యాణ్ రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి డైరెక్టర్ ఆర్.ఎస్.మిశ్రో, రీసెర్చ్ అధికారి ఆకాష్ త్రిపాఠి, సీనియర్ ఇన్వెస్ట్ గ్రేటర్ అశోక్ కుమార్ లక్కర్స్, జెసి ఫర్మాన్ అహ్మద్, ఐటిడిఎ పిఒ వి.వి.రమణ, ఆర్‌డిఒ సుదర్శన్‌దొర, ఎంపిడిఒ పడాల చంద్రకుమారి, తహశీల్దార్ ఎన్.హనుమంతురావు, ఎంఇఒ దేవేంద్రరావు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

పోలాకి : ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని జిల్లా కో-ఆర్డినేటర్ వంక వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తరేవులో గుప్పిడిపేట హెల్త్ సూపర్‌వైజర్ శివగణేష్ ఆధ్వర్యాన కుష్టి, మలేరియా వ్యాధులపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరీరంపై రాగి రంగు మచ్చలు, స్పర్శ నొప్పి లేకుండా ఉన్నట్లయితే వెంటనే మీ దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని సంప్రదించాలన్నారు. వైద్యులు వైద్య పరీక్షలు చేసి నిర్ధారిస్తారని, సంబంధిత మందులు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంద ని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి మంజు రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించా రు. హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఆశా వర్కర్లు అరుణ, అన్నపూర్ణ, లక్ష్మిలు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో నాట్యప్రదర్శన



నాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఇచ్ఛాపురం: శ్రీశైల దేవస్థానం ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ నిర్వహణ అధికారి డి.పెద్దరాజు ఆధ్వర్యాన ఇచ్ఛాపురానికి చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. శుక్రవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్య జరిగిన కూచిపూడి నాట్య ప్రదర్శన మహాగణ పతిమ్, ఢమరుక నాట్యం, శివతాండవం కొలువై ఉన్నాడు, శివ శివ శంభో తదితర నాట్య ప్రదర్శన అద్భుతంగా రసవత్తరంగా సాగింది. అకాడమీ అధ్యక్షులు వెంకటేశ్వర పట్నాయక్, నాట్య గురువు శృతి పట్నాయక్ అధ్యక్షతన కళాకారులు అద్భుత నాట్య ప్రదర్శన నిర్వహించారు. దేవస్థానం అధికారులు ఆలయ అర్చకులచే కళాకారులకు సత్కరించారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పోలాకి : మండలంలోని దండులక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన చింతాడ దిలీప్‌కుమార్ ఇటీవల బదిలీ అయ్యారు. మేరకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనకు శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. గ్రామస్తులు డోల ప్రసాదరావు, గురువు బాలకృష్ణ మాట్లాడుతూ దిలీప్‌కుమార్ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన చేసిన సేవలు గుర్తింపు తెచ్చి పెట్టాయన్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూల శ్రీనివాస రావు, శాసపు శివదేవి, కె.కాళిదాసు, కె.సుదర్శన్ పాల్గొన్నారు.

ముంపు గుణపాఠాలు నేర్చేదెప్పుడు?



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఇటీవల వరుసగా వచ్చిన అల్పపీడనాలతో ప్రభుత్వ, ప్రజల ఆస్తులకు కొంత మేర నష్టం వాటిల్లింది. జిల్లాకు వాయుగుండం ముప్పు ఉంటుందని అంతా ఆందోళన చెందినా ఒడిశా వైపు వెళ్లడంతో సిక్కోలు ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అల్పపీడన ప్రభావంతో పొలాకి, జలుమూరు, పొందూరు, ఎచ్చెర్ల, కవిటి, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో వరద నీరు పంట పొలాలను ముంచెత్తడంతో వరి పైరు నీట మునగడంతో రైతులను కలచివేసింది. ఎల్ఎన్‌పేట, హిరమండలం, సోంపేట ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో నదీ తీర గట్లు కోతకు గురవ్వడం, కాలువలకు గండ్లు పడటం వంటి ఘటనలూ నమోదయ్యాయి. పలాస మండలం బ్రాహ్మణతర్లా, కంబిరిగాం ప్రాంతాల్లో వరహాలగెడ్డ ఉధృతంగా ప్రవహించిడంతో సమీప గ్రామాల ప్రజలు అవస్థలు పడ్డారు. కిష్టుపురం సమీపంలో ఉన్న సవరగెడ్డకు వరద నీరు చేరడంతో రైల్వే అండర్ పాసేజ్‌లో మూడడుగుల నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మహేంద్రతనయ ఉధృతితో కాపుగోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామాలను పాతపట్నంతో కలిపే కాజువేపై నుంచి నీరుచేరడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పొందూరు మండలం రెల్లిగెడ్డ వరద నీరు పోటెత్తడంతో గోకర్ణపల్లి, మొదలవలస వద్ద వంతెనలపై నీరు ప్రవహించడంతో అక్కడా రాకపోకలు కొన్ని గంటల పాటు ఆగిపోయాయి. ఇలా చెప్పుకుంటూ వెళ్తే అనేక ఘటనలను ఉన్నాయి. జిల్లాలో ఆ రోజు సగటున 10.5 మి.మీ వర్షపాతమే నమోదయింది. ఈ మాత్రం వర్షానికే వాగులు, గెడ్డలు పొంగిపొర్లడం, నదీతీరాల గట్లు కోతకు గురయ్యాయంటే ఇటీవల విజయవాడలో కురిసిన మాదిరిగా 30 సెం.మీ. పైగా వానలు పడి ఉంటే పరిస్థితి ఎలా ఉండేది అర్థం చేసుకోవచు. జిల్లాలో ఆ రోజు కురిసిన వర్షాలకే వరి, మొక్కజొన్న పంటలు కలిపి సుమారు 3 వేల ఎకరాల్లో దెబ్బతిన్నాయి. వర్షాలతో 20 చోట్ల రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 43 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. 11 చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.

తుపాన్ల ప్రభావంతో పెనుగాలుల ధాటికి చెట్లు కూలడం, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం సహజమే. వాటిని నిలువరించడం ఎవరి చేతిలోనూ ఉండదు. వర్షాలు, వరదల వల్ల కలిగే కష్టాలు, నష్టాలు నుంచి ప్రజలను రక్షించ గలిగే పనిమాత్రం ప్రభుత్వం, అధికారులు చేయాల్సి ఉంటుంది. విపత్తుల నిర్వహణను సమర్ధవంతంగా చేయగలిగినప్పుడే అది సాధ్యపడుతుంది. తుపాన్లు, వాయుగుండ హెచ్చరికల సందర్భంలోనే ప్రభుత్వం, పాలనా యంత్రాంగం మేలుకుంటోంది తప్ప సాధారణ రోజుల్లో వాటిపైనే దృష్టి సారించిన పిరిస్థితులు కనిపించడం లేదు. ప్రధానంగా వంశధార, నాగావళి వరదలతో నదీ తీర గ్రామాలు ముంపు బారిన పడుతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. అప్పుడెప్పుడో 17 ఏళ్ల కిందటి ప్రారంభించిన వంశధార కరకట్టలను పది శాతం కూడా పనులు పూర్తి కాకమునుపే ఆపేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి కరకట్టల నిర్మాణానికి అధిక ఖర్చు అవుతుందనే ఉద్దేశంతో వాటిని రద్దు చేసి ముంపు తీవ్రత ఎక్కువగా ఉన్న చోట కరకట్టలను నిర్మించాలని నిర్ణయించింది. నాలుగేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నా వాటికీ ఆమోదం తెలపలేదు. వంశధారలో 40 వేల క్యూసెక్కులు వరద వస్తే చాలు ముందుగా కొత్తూరు మండలం మాతల, నివగాం, హిరమండలంలోకి కొన్ని పల్లపు ప్రాంతాలకు వరద నీరు చొచ్చుకువస్తున్న పరిస్థితిని అనేకసార్లు చూశాం. నాగావళి వరద కరకట్టలదీ అదే పరిస్థితి. నాగావళిలో 40 వేల క్యూసెక్కులు వరద నీరు ప్రవహిస్తే బూర్జ మండలంలోని బూర్జ, లాభం, గుత్తావల్లి, వైపర్త, లక్కుపురం, పణుకుపర్త, అల్లిన, పెద్దపేట, కిలంత్రి ప్రాంతాల్లోని పంట పొలాలను ముంచెత్తాయి. ఏటా ఇదే తంతు జరగుతున్నా కాంగ్రెస్, టిడిపి, వైసిపి వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారంలో ఉన్న వాళ్లు ముంపు ప్రాంతాల్లో పర్యటించడం, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఖాళీ చేసి వెళ్లాలని సలహాలు ఇవ్వడం పాలకులకు సంప్రదాయంగా మారింది.

పొలాల ముంపునకు చెరువులను చెరబట్టడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పొలాలకు ఆనుకుని ఉన్న చెరువులను చాలాచోట్ల కప్పేశారు. వాటిని పొలాలుగా మార్చడమో లేక వాటిపై కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టమో చేశారు. నీటి పారుదలశాఖ అధికారులు వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఏ చెరువు పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. ఇక వాగులు, గెడ్డలు పొంగిపొర్లడానికి జంగిల్ క్లియర్స్ లేకపోవడంతో పాటు చాలా చోట్ల ఆక్రమణలు గురయ్యాయి. కల్వర్లులు వద్ద పూడిక పేరుకుపోవడంతో ఆ నీరు పొలాలను ముంచెత్తడమో లేక వంతెనలపై నుంచి ప్రవహించడమో తటస్థిస్తోంది. వర్షాలు, వరదల సమయంలో ఏటా ముంపునకు కారణమవుతున్న పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి సరియైన ప్రత్యామ్నయాలు, పరిష్కారాలు కనుగోవాల్సిన అవసరం ఉంది.

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నగరంలో గట్టిగా పది మి.మీ వర్షం పడితే చాలు ప్రధాన రహదారులపై మోకాలు లోతు నీరు చేరుతోంది. కాలువలు, రోడ్లు ఏకమవుతున్న పరిస్థితిని అనేకసార్లు చూస్తున్నాం. ఇక వీధులు, కాలనీల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. చెరువులు, నీటి కుంటలను తలపించేలా కనిపిస్తుంటాయి. కాలువల్లో పూడిక తీస్తే వర్షపునీరు స్వేచ్ఛగా ప్రవహిస్తుందనే లెక్కలతో కార్పొరేషన్ అధికారులు అవే పనులు తెగ చేసేస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో కాలువల ఆక్రమణలు, వాటిపై నిర్మాణాలు చాలాచోట్ల చూస్తున్నాం. ప్రధానంగా మిర్తిబట్టి కాలువపై ఇందిరానగర్ కాలనీ నుంచి రామలక్ష్మణ కూడలి, విశాఖ బి.కాలనీ, బ్యాంకర్స్ కాలనీ చాలా ప్రాంతాల్లో ఆక్రమణలకు గురవ్వడంతో పాటు చాలాచోట్ల కుంచించుకుపోయాయి. వీటిని తొలగించి కాలువలను సరిచేయాల్సిన అధికారులు, నగరంలోని ప్రధాన రహదారుల్లోని కాలువల్లో పూడిక తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. శ్రీకాకుళంలో భారీ వర్షపాతం నమోదయితే ఎలా ఉంటుందో 2012 ఆగస్టు నాటి పరిస్థితులు గుర్తు తెచ్చుకుంటే చాలు. ఆ రోజు ఏకధాటిగా కురిసిన వర్షానికి శ్రీకాకుళం నగరం మునిగిపోయింది. డే అండ్ నైట్ కూడలిలో నడుంలోతు నీరు చేరింది. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ రోజు ప్రతిపక్ష నాయకుడి హోదాలో జిల్లా పర్యటనకు వచ్చి డే అండ్ కూడలిలోని బ్లూఎర్త్ హోటల్‌లో బస చేశారు. వర్ష ఉధృతితో ఆయన హోటల్‌లోనే కొంత సేపు ఉండిపోయారు. అడుగు తీసి బయటకు వేయలేని పరిస్థితి అందరికీ అనుభవమే. అప్పటితో పోలిస్తే ఇప్పుడు మరిన్ని ఆక్రమణలు పెరిగాయి. శ్రీకాకుళం నగరం విషయంలో ముందుచూపుతో వ్యవహరించకపోతే అమృత నగరం కాస్తా జలామృత నగరంగా మారే ప్రమాదమూ లేకపోలేదు.

భారీగా గంజాయి స్వాధీనం

డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని బిఆర్ నగర్ సమీపంలో ఐదుగురు వ్యక్తుల నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వివేకానంద తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొంతమంది యువకులు గంజాయి మత్తు బారినపడి సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయాలు కూడా జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ, ఎస్ఐ కె.వెంకటేష్ కలిసి శుక్రవారం బిఆర్ నగర్ సమీపంలో దాడులు నిర్వహించగా ఐదుగురు వ్యక్తులు పట్టుపడ్డారని, వారి వద్ద నుంచి చిన్నచిన్న పొట్లాలుగా కట్టిన రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా పోలీస్ విచారణలో ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని దిగుమతి చేసి పట్టణంలో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

కొంతమందికి విక్రయాలు జరుపుతున్నట్లు తెలిపారన్నారు. ఒడిశా రాష్ట్రంలో వీరికి అమ్ముతున్న వ్యక్తితో పాటు స్థానికంగా కొనుగోలు చేస్తున్న వ్యక్తులను కూడా త్వరలో విచారించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే జిల్లా ఎస్‌పి గంజాయి రహిత శ్రీకాకుళం జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక ఆదేశాలు ఇవ్వడం జరిగిందని దీనిలో భాగంగానే పోలీసులు గంజాయిపై ఉక్కు పాదం మోపే విధంగా విధులు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారని, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ఆశయమని తెలిపారు. గంజాయిపై ఉక్కుపాదం మోపే చర్యల్లో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ తనిఖీలు ముమ్మరం చేసి యువత పెడదారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల దినచర్యను పసిగడుతూ మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని, అప్పటికి వినకపోతే పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. గంజాయికి బానిసలైన యువతకు విశాఖపట్నంలోని రీ హ్యాబిటేషన్ సెంటర్లలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గంజాయితో పట్టుబడ్డ ఐదుగురు నిందితులను ముసుగులు తొడిగి విలేకరుల ముందు ప్రవేశ పెట్టారు. సమావేశంలో సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ కె.వెంకటేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి 11.070 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సిఐ మీసాల చిన్నం నాయుడు తెలిపారు. సిఐ కార్యాలయంలో నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి వ్యాపారం చేస్తున్నారని అన్నారు. కర్నాటక రాష్ట్రం కడెకల్ గ్రామానికి చెందిన ఎస్.రాజేష్, జి.మధు ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. వీరు రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు వస్తుండగా బంగా రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు వివరించారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై నిఘాపెంచామన్నారు. సమావేశంలో ఎస్ఐ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిఐగా నాగరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం ట్రాఫిక్ సిఐగా వి.నాగరాజు శనివారం ట్రాఫిక్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వైజాగ్ సిటీలో ట్రాఫిక్ సిఐగా పనిచేసిన ఆయనను శ్రీకాకుళం బదిలీ చేశారు. గతంలో ఇక్కడ సిఐగా పని చేసిన అవతారంను జెఆర్‌పురం సర్కిల్‌కు ఇటీవల బదిలీ చేశారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


ట్రాఫిక్ సిఐ నాగరాజు



శిబిరంలో పాల్గొన్న సాయిరాం

కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్‌లను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని స్టాఫ్ నర్సులు తొమ్మిది రోజులుగా కొనసాగిస్తున్న ధర్నా శిబిరాన్ని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం హాజరై సంఘీభావం తెలిపారు. శనివారం ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఆవరణలో స్టాఫ్ నర్సులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జిఒ నెంబర్ 115ను తక్షణమే రద్దు చేసి న్యాయసమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందుతున్న బిఎస్‌సి నర్సింగ్, జిఎన్‌ఎంలకు న్యాయం చేయాలన్నారు. 115 జిఒను రద్దు చేసి కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ఇరుపక్షాలకు సమన్యాయం

ప్రజాశక్తి- పొందూరు

లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకోవడం వలన ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి 104 కేసులను పరిష్కరించడం జరిగిందని


లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ పి.రామ్మోహన్, న్యాయవాదులు కె.రమణమూర్తి, బ్రహ్మాజీ, కిరణ్, అశోక్, రాము, సంతోష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో మదనాపురానికి చెందిన మజ్జి నర్సమ్మ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకొని జనసేన ఆమదాలవలస నియోజక వర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్ నర్సమ్మ కుటుంబ సభ్యులు అప్పలనాయుడు, సురేష్‌ను పరామర్శించారు. ఈయనతో పాటు


మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామ్మోహన్

జనసేన నాయకులు అనంత్ కుమార్, పొగిరి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


మృతుడు భార్య కుమారికి ఆర్థికసాయం అందజేస్తున్న కార్మికులు

కార్మికుని కుటుంబానికి ఆర్థికసాయం

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీ యునైటెడ్ బ్రేవరీస్ (బీరుపరిశ్రమ)లో బంటుపల్లికి చెందిన కొంగరాపు సింహాచలం కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనతో పనిచేసిన తోటి కాంట్రాక్ట్ కార్మికులు మృతి చెందిన కార్మిక కుటుంబానికి ఒకరోజు వేతనం రూ.2.60 లక్షలు ఆయన భార్య కుమారికి శనివారం పరిశ్రమ ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికులు మాట్లాడుతూ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులంతా ఒకే మాటపై ఉంటూ తోటి కార్మికులకు ఆపద వచ్చినా ఆదుకోవడంలో ముందుంటామన్నారు.

చికిత్స సాయానికి ఎదురుచూపు

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 21వ వార్డు పరిధిలోని కుద్దిరాంకు చెందిన అల్లు హరి కుమార్తె అల్లు భవాని డిస్మోప్లేస్టిక్ సిండ్రోమ్ అన్న అరుదైన వ్యాధితో బాధ పడుతూ చికిత్స చేయించుకునేందుకు ఆర్థికసాయం కోసం దాతల కోసం ఎదురుచూపు చూస్తుంది. వైద్యుల సూచన మేరకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి ఉందని ఆమె తండ్రి హరి తెలిపారు. ఈ చికిత్స కోసం సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చవు తుందని వైద్యులు తెలియజేశారని, తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక దయనీయ స్థితిలో ఉన్నామని, తమ కుమార్తెను బ్రతికించ డానికి దాతలు ముందుకు వచ్చి పెద్ద మనసుతో సహకారాలు అందించాలని భవాని తల్లిదండ్రులు కోరారు. దాతలు ఎవరైనా సహాయం చేయాలనుకుంటే తమ ఫోన్ పే నెంబర్ 9640139502 కు నగదును పంపించాలని కోరారు.


ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పొందూరు

రెడ్మాడితే దొక్కాడని కుటుంబం. స్వేదం చిందించి శ్రమిస్తేనే పూట గడిచే ఆ కుటుంబం యజమానిని విద్యుత్ వైర్లు రూపంలో మృత్యువు కాటేసింది. మండలం కృష్ణాపురం వద్ద ఫామాయిల్ తోటలో శనివారం పనిచేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో దల్లిపేటకు చెందిన బోగ రాము (39) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు మృతుడు రాము ఫామాయిల్ తోటలో పనిచేసేందుకు వెళ్లగా ఇనుప గెడతో చెట్టు కొమ్మలు కోస్తున్న సమయంలో పైన ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌గురై మృతి చెందాడు. కర్రగెడతో కొమ్మలు కోస్తే ఎటువంటి ప్రమాదం జరిగి ఉండేది కాదని, కాని ఇనుప గెడతో కొమ్మలు కోయడం వలనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు రోధించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వలనే ఈ ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతునికి భార్య రాధాకళ్యాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



ముగ్గురికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట శివకేశవ ఆలయం వద్ద శనివారం పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాల య్యాయి. వీరిని స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

కందిరీగల దాడిలో ఇద్దరికి...

మండలంలోని బలరాంపురానికి చెందిన రమణతో పాటు మరొక్కరిపై శనివారం కందిరీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దాడిని చూసిన స్థానికులు వారికి హుటాహుటాన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రమణతో మరొక వ్యక్తి మేకలకు మేత కోసం గ్రామంలో ఓ తోటకి వెళ్లి చెట్టుకొమ్మ కోస్తున్న సమయంతో ఆ కొమ్మకు ఉన్న కందిరీగలు దాడిచేశాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పోలాకి : మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక ట్రాక్టర్‌పై తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు శంకరరావు, మూర్తి ఆధ్వర్యాన వనవిష్ణుపురం కూడలి వద్ద తనిఖీ చేపట్టి ఇసుక ట్రాక్టర్ పట్టుకున్నామని అన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

అన్నదానంలో అపశృతి

ప్రజాశక్తి- పలాస

అన్నదానం చేస్తుండగా ఓ వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన మండలంలోని బ్రాహ్మణతర్లాలో శనివారం చోటుచేసుకుంది. బ్రాహ్మణతర్లా బజారు వీధిలో గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అన్నదానం నిర్వహించారు. కమిటీ సభ్యుడిగా పట్నాల తిరుపతిరావు (59) అన్నదానం చేస్తుండగా... అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి ప్రారంభం పక్కనే ఉన్న మరో సభ్యుడికి విషయాన్ని చెప్పాడు. ఇంతలోనే కూలబడిపోయాడు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమవుతుండగా... అప్పటికే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడు లైన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతుడికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమార్తెలు లక్ష్మి, ప్రియాంక ఉన్నారు.


తిరుపతిరావు (ఫైల్)

నవ భారత నిర్మాత మోక్షగుండం

భారతీయ ఇంజినీర్లందరికీ సెప్టెంబర్ 15 ఓ పండగ రోజు. ప్రఖ్యాత ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఈ రోజే. ఈ భారతమాత ముద్దుబిడ్డ స్మారకార్థం ప్రతి ఏడాది ఆయన జయంతిని ఇంజినీర్స్ డేగా నిర్వహించుకుంటున్నాం. జాతికి ఆయన చేసిన చిరస్మరణీయ సేవలను మననం చేసుకోవడం ఈ తరం ఇంజినీర్లకు, ఇంజినీరింగ్ వృత్తిలో ప్రవేశిస్తున్న లక్షలాది యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం. మౌలిక వసతుల కల్పనకు ఇంజినీరింగ్ రంగం ఎంత ప్రధానమైనదో జీవితాంతం కార్యశీలురుగా నిరూపించిన మహామనిషి ఆయన. నైతిక విలువల ఆధారంగా పనిచేసి ఇంజినీరింగ్ రంగానికి విశిష్ట గుర్తింపు, గౌరవం సంపాదించి పెట్టారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విశ్వేశ్వరయ్య పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా గిద్దలూరు సమీపంలోని మోక్షగుండం అనే గ్రామంలో ఉండేవారు. 17వ శతాబ్దంలో విశ్వేశ్వరయ్య తాతగారు కుటుంబంతో సహా నాటి మైసూరు సంస్థానంలోని కోలారు జిల్లా చిక్‌బళ్లాపూరు పట్టణంలో స్థిరపడ్డారు. ఆ కుటుంబీకులు ఆ ప్రాంత పరిపాలకుల వద్ద అనేక పదవులు నిర్వహించి ప్రసిద్ధికెక్కారు. వారిలో లక్ష్మీపతిభట్టు అనే ఆయన మంత్రిగా పని చేశారు. ఆయన సేవలకు ప్రతిఫలంగా నాలుగైదు గ్రామాలు ప్రతిఫలంగా లభించాయి. వీటిల్లో ఒకటి ముద్దుపల్లి. ఇదే తరువాత 'ముద్దేనహళ్లి' అయింది. ఈ గ్రామంలో 1861 సెప్టెంబరు 15న శ్రీనివాసశాస్త్రి, వెంకటలక్ష్మమ్మ దంపతులకు విశ్వేశ్వరయ్య జన్మించారు.

విద్యాభ్యాసం

విశ్వేశ్వరయ్య 15 ఏళ్ల వయసులో ఆయన తండ్రి మృతి చెందారు. ఆ సమయంలో చిక్‌బళ్లాపూర్‌లో ఎనిమిదో తరగతి ఉత్తీర్ణుడైన విశ్వేశ్వరయ్య పైచదువులు సాగించడానికి ఇబ్బంది ఏర్పడింది. బెంగుళూరులో ఉన్న ఆయన మేనమామ రామయ్య తన వద్దకు రప్పించుకుని 1875లో వెస్లియన్ మిషన్ హైస్కూలులో చేర్పించాడు. మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు విశ్వేశ్వరయ్య. సెంట్రల్ కాలేజిలో 1881లో బిఏ పట్టా పొందారు. ఆ రోజుల్లో ఇంజనీరింగ్‌లో ఉన్నత శిక్షణకు బెంగుళూరులో వీలుండేది కాదు. మైసూరు సంస్థానం దివాన్‌గా ఉన్న రంగాచార్యులు విశ్వేశ్వరయ్యకు విద్యార్థి వేతనం మంజూరు చేశారు. పూనా ఇంజినీరింగ్ కళాశాల నుంచి 1883 నవంబర్‌లో ఆయన ఎల్‌సిఇ, ఇసిఎల్ పరీక్షల్లో బొంబాయి రాష్ట్రం మొత్తమ్మీదే ప్రథముడిగా ఉత్తీర్ణులయ్యారు. అత్యుత్తమ విద్యార్థిగా నిలిచిన ఆయన 'బర్కలే' బంగారు పతకం అందుకున్నారు.

ఇంజినీరుగా ప్రస్థానం

ఇంజినీరింగ్ పరీక్షల్లో బొంబాయి రాష్ట్రంలోనే ప్రథముడిగా నిలవడం ఆయన జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి బొంబాయి ప్రభుత్వంలో ఉద్యోగం ఇవ్వడం ఆనాటి ఆనవాయితీ. దీని ప్రకారం 1884 మార్చిలో విశ్వేశ్వరయ్య బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్‌వర్క్స్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీరుగా నియమితులయ్యారు. పంజ్రా నదీ జలాలను దతారి గ్రామానికి 'సైఫన్' పద్ధతి ద్వారా సరఫరా చేసే బాధ్యతను బొంబాయి ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు అప్పగించింది. ఆ ప్రాంతం కొండలమయం. పైగా, విపరీతమైన వర్షాలు కురుస్తున్నాయి. అయినప్పటికీ, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆ పనిని విజయవంతంగా ఆయన పూర్తి చేశారు. ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. ఆ సమయంలోనే మలేరియా వ్యాధి బారిన పడటంతో తనను బదిలీ చేయాల్సిందిగా కోరారు. దీంతో, ఆయనను పూనాలో రహదార్లు, భవనాల విభాగానికి బదిలీ చేశారు.

సింధు నదీ జలాలను సుక్కూరు పట్టణానికి సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బ్రిటిష్ ఇంజినీరును నియమించినా, ఆయన ముందుకు రాలేదు. దీంతో, ప్రభుత్వం ఈ పనిని విశ్వేశ్వరయ్యకు అప్పగించింది. సింధునదిలో ఒండ్రు ఎక్కువ. దీంతో, మంచినీటి సరఫరా కష్టసాధ్యమైంది. దీన్ని అధిగమించేందుకు గానూ విశ్వేశ్వరయ్య నదీతీరంలో పెద్ద బావులు తవ్వించారు. నదీ జలాలు ఇసుక పొరల్లోంచి బావుల్లోకి చేరే ఏర్పాటు చేశారు. దీంతో నీరు శుభ్రపడింది. ఈ నీటిని పంపుల ద్వారా లిఫ్టు చేసి పైన ఉన్న జలాశయంలో నింపేవారు. అక్కడి నుంచి

నేడు ఇంజినీర్స్ డే



గొట్టాల ద్వారా సుక్కూరు పట్టణానికి నీటి సరఫరా జరిగింది.

విదేశాల్లో సైతం సేవలు

1904లో విశ్వేశ్వరయ్య బొంబాయి రాష్ట్ర శానిటరీ ఇంజినీరుగా నియమితులయ్యారు. ఆ కాలంలో మన దేశం నుంచి ఇంగ్లాండ్‌కు సూయిజ్ కాలువ ద్వారా నౌకలు వెళ్లేవి. ఈ కాలువ ప్రవేశ ద్వారం వద్ద ఏడెన్ రేవు పట్టణం ఉండేది. ఈ పట్టణం పాలనా బాధ్యతలు బొంబాయి రాష్ట్రంపై ఉండేవి. ఏడెన్ పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఆ రోజుల్లో సముద్ర జలాలను ఆవిరిగా మార్చి, వాటిని గొట్టాల ద్వారా పట్టణానికి చేరవేసి తరువాత దాన్ని నీరుగా మార్చుకునేవారు. దీనివల్ల ఎంతో వ్యయం అయ్యేది. ఈ సమస్యను పరిష్కరించే పనిని బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు అప్పగించింది. పట్టణానికి 18 మైళ్ల దూరంలోని లహేజ్ వద్ద బావులు తవ్వి, చుట్టుపక్కల కొండల నుంచి వచ్చే వర్షపు నీటిని అందులో నిల్వ చేసి, అక్కడ్నుంచి ఆ నీటిని ఏడెన్ పట్టణానికి తరలించేలా విశ్వేశ్వరయ్య పథకం రూపొందించడంతో నీటి సమస్య తీరింది. ఏడెన్ పట్టణంలో ప్రజారోగ్యం కోసం భూగర్భ మురుగు కాలువలు నిర్మించి అక్కడి ప్రజల మన్ననలు అందుకున్నారు విశ్వేశ్వరయ్య. ఆయన కృషిని ప్రశంసిస్తూ ప్రభుత్వం 'కెయిజర్-ఇ-హింద్' స్వర్ణ పతకంతో సత్కరించింది.

ఉద్యోగానికి రాజీనామా

భారతీయులను బ్రిటిష్ అధికారులు చిన్నచూపు చూడటాన్ని విశ్వేశ్వరయ్య సహించలేక పోయేవారు. అన్నివిధాలా తాను చీఫ్ ఇంజినీర్ పదవికి అర్హుడినైనా, ఆ పోస్టును బ్రిటిష్ వారికే కేటాయించడాన్ని నిరసిస్తూ తన ఉద్యోగానికి 1908లో రాజీనామా చేశారు. ఆయన రాజీనామా లేఖను చూసిన గవర్నర్ సిడెన్‌హాం ఆశ్చర్యపోయారు. విశ్వేశ్వరయ్యకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అప్పటికి ఆయన ఉద్యోగంలో చేరి 23 ఏళ్లు అయింది. మరో రెండేళ్లు పనిచేస్తే పింఛను లభించేది. అయినా భారతీయుల ప్రతిభను గుర్తించనప్పుడు పదవి ఎందుకని ప్రశ్నిస్తూ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. గవర్నర్ ఆయనకు పూర్తి పింఛను మంజూరు చేస్తూ, రాజీనామానూ అంగీకరించారు.

దేశవ్యాప్తంగా సేవలు

1937లో ఒడిశాలోని మహానది వరదల వల్ల అపారమైన నష్టం వాటిల్లింది. వరదల నిరోధానికి తగు సూచనలివ్వాల్సిందిగా విశ్వేశ్వరయ్యను గాంధీజీ కోరారు. అప్పటికి విశ్వేశ్వరయ్య వయసు 76 ఏళ్లు. వయసు మీద పడుతున్నా మహానదీ పరీవాహక ప్రాంతాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, సముచిత పథకాన్ని సూచించారు. ఒడిశా ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేసింది. ఒడిశా ప్రభుత్వం తనకు పంపిన గౌరవ ధనాన్ని ఆయన తిప్పి పంపుతూ, గాంధీజీ ఆదేశం మేరకే తాను సేవలు అందించానని పేర్కొన్నారు. 1939లో బెంగుళూరులో విమాన కర్మాగార పథకం రూపకల్పనలోనూ ఆయన తన సేవలందించారు. విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ నిర్మాణంలో ఎదురైన అవరోధాన్ని అధిగమించేందుకు ఆయన చక్కని సూచన చేశారు. గంగా నదిపై వంతెన నిర్మించాలని రైల్వే బోర్డు నిర్ణయించగా, ఈ వంతెనను ఎక్కడ నిర్మించాలనే విషయమై భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. దీన్ని పరిశీలించి సరైన సూచన ఇవ్వాల్సిందిగా విశ్వేశ్వరయ్యను నాటి ప్రధాని నెహ్రూ కోరారు. అప్పటికి 90 ఏళ్లు దాటినా, విశ్వేశ్వరయ్య తన సమ్మతి తెలిపారు. అనంతరం బి.సి బైజాల్, బి.బి.వర్మ, వి.పి.భండారీ, పి.బి అద్వానీలను తనకు సహాయకులుగా నియమించాల్సిందిగా కోరారు. ఈ సమితి కార్యదర్శిగా బైజాల్‌ను నియమించారు. ఈ సమితి కార్యక్రమాలకు, పర్యవేక్షణకు ఒక రైలుబండిని, నదిపై ఎత్తు నుంచి పరిశీలించడానికి ఒక విమానం ఏర్పాటు చేశారు. ఈ సమితి పాట్నా, కలకత్తా, ఖాట్మండ్ తదితర ప్రాంతాలకు వెళ్లి అనేకమంది అభిప్రాయాలు సేకరించింది. మొఖామే వద్ద వంతెన నిర్మించాల్సిందిగా సూచించారు. ఈ వంతెన నిర్మాణం 1953లో ప్రారంభమై, ఆరేళ్లలో పూర్తయింది.

ఇంజినీర్లకు విశ్వేశ్వరయ్య ఆదర్శం

భారతరత్నం మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్ప దేశభక్తుడని, ఈ దేశానికి ఎనలేని సేవలు చేశారని ఆయన జీవితం భావితరాల ఇంజినీర్లకు ఆదర్శప్రాయమని పంచాయతీరాజ్ ఇంజినీర్ల జెఎసి చైర్మన్ సనపాల రామకృష్ణ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆనాడు ఇప్పుడున్న సదుపాయాలు లేవని, కేవలం లాంతర్ల వెలుగులో పనిచేయాల్సి వచ్చేదని అన్నారు. వాహనాలు లేకపోయినా కాలినడకన వెళ్లి పనులు చేసేవారని అన్నారు. అదే స్ఫూర్తిని తీసుకొని నేటి ఇంజినీర్లు మెలగాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ఈ ఆధునిక సదుపాయాలను ఉపయోగించుకొని విశ్వేశ్వరయ్య



ఆదర్శవంతమైన జీవితాన్ని ఆయన నిజాయితీని, నిబద్ధతను పనివిధానాన్ని అలవర్చుకొని ఆచరించడం మన ముందున్న కర్తవ్యం, అదే ఆయనకు ఇవ్వగలిగే గొప్ప నివాళి అని అన్నారు.

- సనపల రామకృష్ణ,
పంచాయతీరాజ్ ఇంజినీర్ల జెఎసి చైర్మన్

విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో...

ప్రపంచ ఇంజినీర్లకు స్ఫూర్తి నింపిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో నేటి ఇంజినీర్లు సేవాభావంతో సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ జెఎసి ప్రధాన కార్యదర్శి మహంతి తెలిపారు. ఇంజినీర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో పనిచేస్తున్న



ఇంజినీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తి అని అన్నారు. అదే స్ఫూర్తితో ప్రపంచ ఇంజినీర్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆయన సివిల్ ఇంజినీర్ అయినప్పటికీ రైల్వే బ్రిడ్జిలు, సర్దార్ కాటన్ వంటి బ్రిడ్జిలు నేటికీ వందేళ్లయినా చెక్కుచెదరని ఉన్నాయంటే అది ఇంజినీర్లకు ఉన్న ప్రాధాన్యత అని అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం సాంకేతికంగా అభివృద్ధి చెందిన పరిస్థితుల్లో ఇంజినీర్లు మరింత వండర్స్ సృష్టించాలని అన్నారు. రానున్న కాలంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

- కె.సిహెచ్.మహంతి,
పంచాయతీరాజ్ ఇంజినీర్ జెఎసి ప్రధాన కార్యదర్శి

నాణ్యత, నమ్మకం హారిక కన్‌స్ట్రక్షన్స్ ప్రత్యేకత

లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి ప్రసాద్

- నిర్మాణ రంగంలో రెండు దశాబ్దాల అనుభవం
- కన్‌స్ట్రక్షన్ రంగంలో సివిల్ ఇంజనీర్ల పాత్ర కీలకం
- హారిక కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టెంట్స్ అధినేత కె.ఎస్.ఎస్.వి ప్రసాద్



ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఇంజనీర్స్ డే సందర్భంగా హారిక కన్‌స్ట్రక్షన్ అండ్ కన్సల్టెంట్స్ అధినేత, శ్రీకాకుళం జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ ఆఫ్ ఎపి అధ్యక్షుడు కె.ఎన్.ఎస్.వి. ప్రసాద్ (హారిక ప్రసాద్) ప్రజాశక్తితో మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నేటి ఇంజనీర్లకు, బావి భారత ఇంజనీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. తమ కంపెనీ హారిక కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టెంట్స్ వాస్తును అనుసరించి నాణ్యతతో కూడిన కట్టడాలే మా ప్రత్యేకత అని చెప్పారు. నిర్మాణాల్లో రాజీ పడకుండా వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ విజయం రహస్యమన్నారు. అభిరుచి, అధునాతన పద్ధతుల్లో నిర్మాణాలు చేపట్టడంలో మా సంస్థకు మంచి పేరు ఉందన్నారు. ఎంతో ఒత్తిడితో కూడుకున్న ఈ సివిల్ రంగంలో రాణించాలంటే చేసే పనిలో నిజాయితీ ఉండాలని అన్నారు. వినియోగదారుడు తనకు నిర్మాణం అప్పగిస్తే తన ఇల్లు లానే భావించి కడతామన్నారు. వందేళ్ల పాటు చెక్కుచెదరని నిర్మాణం ఇవ్వడమే తమ లక్ష్మమని చెప్పారు. నాణ్యమైన మెటీరియల్, క్వాలిటీ అందించడం వల్లే నిర్మాణ రంగంలో తాను ఉన్నత స్థాయికి చేరుకో గలిగానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మీకు స్థలం ఉంటే మేము ప్లాన్ అప్రూవ్ చేయించి, బ్యాంకు లోన్ ఇప్పించి వాస్తు అనుసరించి మీకు ఇల్లు ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాం. నమ్మకం, నాణ్యత మా నినాదం. శ్రీకాకుళం కార్పొరేషన్ ప్రాంతానికి వస్తే చిన్న చిన్న రోడ్లకు సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్ అప్రూవల్‌కు ఎంతో కృషి చేశాం. గత ప్రభుత్వంలో కమిషనర్ దగ్గర నుంచి అమరావతి వరకూ ఫైల్ పంపించాం. అమరావతిలో ఫైల్ పెండింగ్ ఉంది. ఈ ప్రభుత్వం సర్క్యులేషన్ పాట్రన్ ఫైల్ అప్రూవల్ చేయాలని కోరుచున్నాను. దీనివలన ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని చెప్పారు.

నిర్మాణ రంగంలో రెండు దశాబ్దాల అనుభవం

నేల స్వభావం పరీక్షించి డిజైన్ ఇచ్చినప్పుడే మనపై మనకు నమ్మకం కలుగుతుందని స్పష్టం చేశారు. లేకుంటే మేస్త్రీలకు, ఇంజినీర్లకు పెద్ద తేడా ఉండదన్నారు. తన జీవిత భాగస్వామి శోభారాణి సేవల్లో సహకారం మరువలేనిదని తెలిపారు. కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ రెండు దశాబ్దాల కిందట ప్రారంభించిన హారిక కన్‌స్ట్రక్షన్స్, కన్సల్టెంట్స్ సంస్థ అధినేత అంచలంచెలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్‌గా తండ్రి కరణం మోహనరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన చిన్నాన్న కరణం అప్పారావులను చూసి తాను ఇంజినీర్ కావాలని చదివానని అన్నారు. ఇంజినీరింగ్ చదివి పలు కంపెనీలకు సేవలు అందించానని తెలిపారు.

సమాజంలో సివిల్ ఇంజనీర్ల పాత్ర కీలకం

ఏదైనా సమాజం దేశం, రాష్ట్రం,ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సివిల్ ఇంజనీర్ పాత్ర ఎంతో ముఖ్యమైనది, సివిల్ ఇంజనీర్ అనేవాడు లేకపోతే ఎటువంటి అభివృద్ధి ఉండదు. పూర్వకాలంలో రాజులు కోటలు కట్టారన్నా, చెరువులు తవ్వించారన్నా, పిరమిడ్ వంటి కట్టడాలు నిర్మించారన్నా అదంతా సివిల్ ఇంజనీర్ ఘనత మాత్రమే. ఒక ప్రాంతం అభివృద్ధి చెందుతుందంటే దానికి కారణం సివిల్ ఇంజనీర్. నేటి యువత సాఫ్ట్‌వేర్ వైపు ఎక్కువ మొగ్గ చూపి సిఇసి, సిఎస్‌సి గ్రూపుల తీసుకుంటున్నారు. ఇల్లు కట్టాలంటే సివిల్ ఇంజనీర్లు కావాలన్నప్పుడు సివిల్ ఇంజనీర్స్ దొరికే పరిస్థితి ఉండదు. యువత సివిల్ ఇంజనీర్ రంగంలో వైపు రావాలి. దేశ అభివృద్ధికి పాటు పడాలని కోరుతున్నాను. రైతు పంట పండించాలంటే సాగునీరు అవసరం, సాగునీరు కావాలంటే ప్రాజెక్టులు నిర్మించాల్సి ఉంటుంది. వాటికీ సివిల్ ఇంజనీర్ల అవసరం పడుతుంది. అపార్ట్మెంట్స్ నిర్మించాలన్నా, రోడ్లు వెయ్యాలన్నా, డ్రైనేజీ కట్టాలన్నా ఇదంతా సివిల్ ఇంజనీర్ వలన జరుగుతున్నాయి. తాను కూడా సివిల్ ఇంజనీర్ అయినందుకు గర్వపడు తున్నానన్నారు. సివిల్ ఇంజనీర్ దేశానికి వెన్నుముక లాంటివాడని, రైతు తర్వాత సివిల్ ఇంజనీర్‌కు అంత ప్రాముఖ్యత ఉందని, యువత కూడా సివిల్ ఇంజినీరింగ్ వైపు మొగ్గు చూపాలన్నారు.



నిర్మాణ రంగంలో నూతన ఒరవడి

వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ జిల్లా అధ్యక్షులు ముని శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్: నిర్మాణ రంగంలో నూతన ఒరవడి సృష్టించి ఇంజనీర్లకు మార్గ దర్శిగా మోక్ష గుండం విశ్వేశ్వరయ్య సేవ లందించారు. ఆయన జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే నిర్వహించు కోవడం ఇంజినీర్లందరికీ గర్వకారణమని క్రియేటివ్ కన్‌స్ట్రక్షన్ అధినేత, సివిల్ ఇంజినీర్ ముని శ్రీనివాస రావు అన్నారు. ఈ సందర్భంగా ఇంజినీర్లుకు ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు ఉన్న అత్యంత క్లిష్ట పరిస్థితుల దృష్ట్యా వెంటనే బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్, లేఔట్ రెగ్యుల రైజేషన్ స్కీమ్‌లకు కొత్త నోటిఫి కేషన్ రిలీజ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నోఏళ్లుగా ప్రజలందరూ బిపిఎస్, ఎల్ఆర్ఎస్ స్కీముల కోసం ఎదురు చూస్తున్న తరుణ మన్నారు. ఇంతకుముందు డీవియేషన్స్ ఉన్న బిల్డింగ్స్ ఓనర్స్ అలాగే అనాథరైజ్డ్ లేఔట్స్‌లో తెలియక ప్లాట్లు కొన్న వాళ్ళకి బిల్డింగ్ ప్లాన్ కొత్తగా పెట్టుకొని, అప్రూవల్ తెచ్చుకొని, కొత్త ఇల్లు కట్టుకొని తమ సొంతింటి కల నెరవేర్చు కునేందుకు దోహద పడుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో, కార్పొరే షన్‌లో యుఎల్‌బిలో సర్క్యులేషన్ పేటర్న్ చేయించి వెంటనే అమలుపరిస్తే పేద, మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి వారికి ఇల్లు కట్టుకోవడానికి ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. మన జిల్లాకి గతంలో 2000లో ఇచ్చిన మాస్టర్ ప్లాన్ ఇప్పటికీ కూడా అమలులో ఉందని, కరోనా తర్వాత 2024 మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ రిలీజ్ అయినప్పుడు తాము 18 పాయింట్లతో తగు సూచనలతో అసోసియేషన్ తరుపున ప్రభుత్వానికి రిప్రజెం టేషన్ ఇవ్వటం జరిగిందని, ఇంకా ఫైనల్ మాస్టర్ ప్లాన్ రిలీజ్ కాక కొత్తగా బిల్డింగులు కట్టుకునే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కొత్త మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రిలీజ్ అయ్యేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మిగతా జిల్లాలతో పోలిస్తే శ్రీకాకు ళంలో నిర్మాణ రంగం చాలా కుదేలై నిర్మాణ రంగంలో ఉన్న అన్ని వర్గాల వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని, నిర్మాణ రంగం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కొత్త ప్రభుత్వాన్ని కోరు కుంటున్నామన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఇఇ బయ్యన్నాయుడు

సౌర విద్యుత్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి ఇంటి పైకప్పుపై సోలార్ ప్లేట్లు అమర్చి వాటి ద్వారా వచ్చే సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకుని సొంత అవసరాలను తీర్చు కోవచ్చని, మిగులు విద్యుత్‌ను తిరిగి విద్యుత్ శాఖకు అమ్ముకోవడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చు కోవచ్చని ఇపిడిసిఎల్ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు సూచించారు. శనివారం నగరంలోని కంపోస్టు కాలనీలో పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోలార్ పథకాన్ని పొందడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వినియోగించు కోవచ్చన్నారు. ఆసక్తి గల వినియోగదారులు ఈసౌకర్యాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఈ సదస్సులో విద్యుత్ శాఖ డిడి సురేష్, ఎఇ కమల హాసన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పొందూరు: ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమించి ఆటోలను నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ వి.సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక స్టేషన్‌లో శనివారం ఆటోడ్రైవర్లుతో సమావేశాన్ని నిర్వహించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ముందు, వెనుకవైపున అధనంగా ప్రయాణికులను కూర్చొబెడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే మద్యం తాగి ఆటోలను నడపరాదని, మితిమీరిన వేగంగా నడపరాదని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు.



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న దుర్గాప్రసాద్

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 23వ వార్డులో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తుండటంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కూన రవికుమార్ పురపాలక సంఘానికి నిధులు తేవడంతో వార్డుల్లో కాలువల్లో పూడికతీత పనులు విస్తృతంగా జరుగుతున్నాయని 16వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి గుడ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం 16వ వార్డు పరిధిలోని కంద్రపేట, వరదా వారి క్వార్టర్స్, తహశీల్దార్ కార్యాలయం రోడ్డులో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషితో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామన్నారు.

ఎస్ఐలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎం.హరికృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ వన్‌టౌన్‌కు వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. అలాగే గార పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రెళ్ల జనార్ధన్ బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి డిపిఒ కార్యాలయం నుంచి గార పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

దేశ ప్రగతికి హిందీ దోహదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారత జాతి సమైక్యానికి, తద్వారా దేశ ప్రగతికి జాతీయ భాష హిందీ ఎంతగానో దోహద పడుతుందని నెహ్రూయువ కేంద్రం జిల్లా అధికారి కె.వెంకట ఉజ్వల్ అన్నారు. జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా హిందీ ఫోరం శ్రీకాకుళం సారధ్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన రాజభాష హిందీ శోభాయాత్రను ఆయన ప్రారంభించారు. జాతీయ భాష హిందీ భవిష్యత్‌లో విశ్వభాషగా ఎదగాలని జిల్లా పర్యాటన అధికారి ఎన్. నారాయణరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌సిఎల్ విశ్రాంత జనరల్ మేనేజర్ బి. భాస్కరరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, లయన్స్ క్లబ్ సెంట్రల్ వ్యవస్థాపకులు నటుకుల మోహన్, డాక్టర్ బాడాన దేవభూషణరావు, జనసేన జిల్లా నాయకులు పిసిని చంద్రమోహన్, హిందీ ఫోరం సమన్వయకర్తలు ఐ.సంతోష్ కుమార్, మందపల్లి రామకృష్ణారావు, నిరంజన్, హిందీ ఉపాధ్యాయులు, భాషాభిమానులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌వైకె

కార్మికుల ఆశాజ్యోతి ఏచూరి



కంచిలి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు



కొత్తూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కార్మికుల, కర్షకుల ఆశాజ్యోతి కీర్తిశేషులు సీతారాం ఏచూరి అని, ఆయన మృతి కమ్యూనిస్టు, ప్రజాతంత్ర లౌకిక ఉద్యమాలకు తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. మండల నాయకులు హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన స్థానిక సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ శనివారం నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్క్సిజాన్ని భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా వర్తింపచేసి విప్లవ శక్తులను కొత్త పుంతలు తొక్కించడానికి విరామ మెరుగక కృషి చేశారని అన్నారు. 2011లో రెడ్డీస్ లేబరేటరీస్ కార్మికుల వంద రోజుల పోరాటం సందర్భంగా సీతారాం ఏచూరి జిల్లాలోని పైడిభీమవరం వచ్చి కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలియజేశారని గుర్తు చేశారు. కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శి వామపక్ష లౌకిక ప్రజాతంత్ర శక్తుల సమన్వయ రథసారథి ఏచూరి మృతి తీరని లోటుని వారన్నారు. 12 ఏళ్ల రాజ్యసభ సభ్యునిగా విశేష కృషి చేసిన ఆయనను ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు వరించిందన్నారు. రాజ్యసభ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రపతి ప్రసంగానికి సవరణలకు పట్టుబట్టి సాధించడంలో ఆయన నిబద్ధతకు, కార్యదక్షతకు నిదర్శనమని వారన్నారు. పార్లమెంట్లో ప్రజావాణి వినిపించారని అన్నారు. ఈ సంతాప సభలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బోర శ్రీను, సనపల ఆనంద్, పొన్నాన అప్పన్న, సనపల రామారావు, సిహెచ్.వెంకటరావు పాల్గొన్నారు.

కంచిలి: కంచిలి సిఐటియు కార్యాలయం వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం నాయకులు సంగారు లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు వి.తారకేశ్వరరావు, కె.రాజు, కొబ్బరి కార్మిక సంఘం నాయకులు పి.కృష్ణ పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరులో సిపిఎం జిల్లా నాయకులు సిర్ల ప్రసాద్ అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.అప్పారావు, ఎన్.అప్పన్న, తెల్లన్న, దుర్గారావు, రమేష్, మిన్నారావు, త్రినాథరావు పాల్గొన్నారు. అలాగే గొట్టిపల్లి పంచాయతీలో సీతారాం ఏచూరి సంస్మరణసభ నిర్వహిచారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆరిక గణపతి, రామారావు, శివ, నిమ్మక రాజు, గోపయ్య పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి మరణం రైతాంగానికి, వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య, శ్రామికవర్గ ఉద్యమాలకు తీరనిలోటని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ అన్నారు. శనివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నివాళ్లర్పించారు. సంతాప సభలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శిగా నిలిచారన్నారు. సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని పోరాటం సాగించిన యోధుడని కొనియాడారు. ఈ సభలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి వెలమల రమణ, రైతు సంఘం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, కె.కొండయ్య, టి.అజయ్ కుమార్, టి.నందోడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యాన



కోటబొమ్మాళి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు



శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న సూర్యనారాయణ



శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న మున్సిపల్ కార్మికులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని, ఆయన మరణం కార్మిక, కర్షక, ఉద్యోగ, బహుజనులకు తీరని లోటని సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.గణేష్, ఎన్.బలరాం అన్నారు. నగరంలోని గుడివీధి మస్తర్ పాయింట్ వద్ద సంఘం ఆధ్వర్యాన సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఎ.శంకర్, ఎ.గురుస్వామి, ఎ.రాము, డి.చిట్టి, డి.గణేష్, ఆర్.యుగంధర్, మహిళలు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్య కళాశాల, సర్వజనాసుపత్రిలో

బహుముఖ ప్రజ్ఞాశాలి, మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి అని, ఆయన మరణం వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు అన్నారు.రిమ్స్‌లో ఏచూరి మృతికి రిమ్స్ కార్మికులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.సావిత్రి, టి.కుమారి, బి.సంతోషి, జి.కృష్ణవేణి, సిహెచ్ రాజేశ్వరి, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



రణస్థలం : పాలాభిషేకం చేస్తున్న ఎస్ఐలు, సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఎన్నికల తర్వాత సెబ్‌ను ఏర్పాటు చేస్తూ గత వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దానికి సంబంధించిన 12 జిఒలను రద్దు చేస్తూ తాజాగా సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఇబి ఏర్పాటుకు ముందు ఎక్సైజ్ శాఖలో 6,274 మంది సిబ్బంది ఉండగా వారిలో 4,393 మందిని అప్పటి ప్రభుత్వం ఎస్ఇబి విభాగానికి కేటాయించింది. దీంతో వారంతా ఎక్సైజ్ శాఖకు అనుబంధంగా పని చేస్తున్నారు. తాజా ఉత్తర్వులతో వారంతా రిలీవ్ కానున్నారు. దీంతో రణస్థలం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐలు ఎం.రవిప్రసాద్, పి.నాగలక్ష్మి, సిబ్బంది శనివారం సిఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

ఆమదాలవలస: ఎస్ఇబి రద్దు చేస్తూ ఎక్సైజ్ మాతృశాఖకు ఉద్యోగులను బదిలీ చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఎక్సైజ్ సిఐ కె.రాజారావు ఆధ్వర్యంలో సిబ్బంది సిఎం చంద్రబాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎస్ఇబి స్టేషన్ బోర్డులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ బోర్డులుగా మార్పు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆమదాలవలస : పాలాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ సిఐ రాజారావు

పొందూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌లో సిఎం చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు ఎస్ఐ రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్‌లు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర కాలనీలో వినాయక చవితి ముగింపు వేడుకలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మి గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 3 వేల మంది యాత్రికులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దాతల సహకారాలతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి బోయ్స్ టైలర్ యజమాని గోవింద్ వాటర్ బాటిళు ,, వాటర్ ప్యాకెట్లను అందించారు.

రణస్థలం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మండలంలోని కంబాలపేటలో శనివారం సర్పంచ్ నడుకుదిటి రజని ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గోవింద్ దాసు, త్రినాథరావు, ముంగం శ్రీనివాసరావు, రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రం గరికిపాలెం దగ్గర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎచ్చెర్ల: మండలంలోని సంతోషిమాత ఆలయం, ఫాజుల్‌బాగ్ పేట, హయాతినగరం, అల్లినగరం తదితర ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సూర శ్రీనివాసరావు పాల్గొన్నారు. జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 26 డివిజన్ పరిధిలో అరసవల్లి వెలమవీధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి డివిజన్ ఇన్‌ఛార్జి ఉంగటి వెంకటరమణ, ఉంగటి పాపారావుల ఆధ్వర్యంలో 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాడాడ కృష్ణ, రాయిల సూర్య దీప్, అల్లు కురమయ్య, కొవ్వూరు రమణ, భాసూరు సంతోష్ తదితరులున్నారు. అలాగే కుశాలాపురంలో జల్సా బ్యాచ్ ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ పాల్గొని నిర్వహకులను అభినందించారు.



రణస్థలం రూరల్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

క్రీడలతో మానసికోల్లాసం



కోటబొమ్మాళి : విజేతలను అభినందిస్తున్న కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- నరసన్నపేట

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, అందుకు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, జిల్లా కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి అన్నారు. డిసెంబరు 14 నుంచి కాకినాడలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో శనివారం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ఏదో ఒక పని ఒత్తిడికిలోనై ఉంటున్న ఉపాధ్యాయులకు ఇటువంటి సమయంలో ఆటలు ఉత్సాహం కలిగిగిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు టి.సుధీర్, ప్రధాన కార్యదర్శి కె.ఆదినారాయణ, పోలాకి మండల అధ్యక్షులు ఎస్.రాజేష్‌కుమార్, పి.కృష్ణారావు, శ్యామ్‌కుమార్, ఉమాభాస్కర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా శనివారం కోటబొమ్మాళి జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలను నిర్వహించారు. పురుషులకు క్రికెట్, సెటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్, స్త్రీలకు చెస్, క్యారమ్ నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు యర్నాగుల వాసుదేవరావు, గొండు నారాయణరావు, గణపతిరావు, పాపారావు, ఆనందరావు, కమలాభాయి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి, గౌరవాధ్యక్షులు వైకుంఠరావు, మన్మథరావు, చంద్రమోహన్‌లు పాల్గొన్నారు.

సోంపేట : యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రభుత్వ ఉపాధ్యాయులు అందరికీ కవిటీ వేదికగా ఆటల పోటీలను శనివారం నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, చెస్, షటిల్ ఆటలను కవిటి కళాశాల మైదానంలో ఆడించారు. ఈ ఆటలను జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్, మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు జానకిరావు, జగదీష్, సోంపేట మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు దొరబాబు, కూర్మారావ్, కంచిలి మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు రవి, మురళి నాయక్, ఇచ్ఛాపురం సిద్ధాంతి పాల్గొన్నారు. రెండో సెషన్లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా సహాధ్యక్షులు కేదాలయ్య, గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, రాష్ట్ర కౌన్సిలర్ చిట్టిబాబు పాల్గొన్నారు. నాలుగు మండలాల నుంచి క్రికెట్‌కు 20 టీములు, చెస్ 25 మంది, వాలీబాల్ 8 టీంలు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు.

పలాస : యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసాన్ని నింపటానికి ఆటల పోటీలను కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్ ఆటల పోటీలను ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి రాష్ట్ర కౌన్సిలర్ బి.చిట్టిబాబు, పూర్వ జిల్లా కార్యదర్శి కంచరన్న రమేష్ గెలుపొందిన టీమ్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, జిల్లా పూర్వ కార్యదర్శి కంచరానా రమేష్, మందస మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, అధ్యక్షులు జగదీష్ బడిత్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి సుందరీకరణే లక్ష్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పట్టణం అత్యంత సుందరీకరణగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్షించారు. ఇంటి పన్నులు, తాగునీటి సమస్యల పరిష్కారం, పశువుల సంచారం లేకుండా చర్యలు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ, పారిశుధ్య కార్మికుల సమస్యలు తదితర అంశాలపై ఆరా తీసి సంబంధిత అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పన్నును సకాలంలో వసూలు చేయాలని. సూచించారు. సిబ్బంది సక్రమంగా పనిచేయాలని, అసెస్మెంట్ లేనివారు తక్షణమే వేయించుకోవాలని హితవుపలికారు. ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. త్వరలో సులభ కాంప్లెక్సులు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. సిఎస్ఆర్ నిధుల నుంచి నిర్మాణం చేపడతామని అన్నారు. బాధ్యతగా పనిచేస్తే మన లక్ష్యానికి చేరుకుంటామన్నారు. అనంతరం నరసింగపల్లికి టిడిపి నాయకులు దారపు జోగారావు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈయన వెంట బగాది శేషగిరి, పినకాన జోగారావు, మెండ దమయంతి, కణితి కిరణ్‌కుమార్, పొట్నూరు ఆనందరావు, హనుమంతు ఉదయ్‌భాస్కర్ ఉన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులను ఆదుకోవాలి

టెక్కలి రూరల్ : టెక్కలి పట్టుమాదేవి కోనేరు గట్టు పక్కన గల ఫుట్‌పాత్ వ్యాపారులను ఆదుకోవాలని సిపిఎం నాయకుడు కొల్లి యల్లయ్య, సీతమ్మ, చిన్నమ్మడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం కలిసి బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ అధికారులు ఉపాధి కల్పించకుండా చేశారని అన్నారు. కనీసం తోపుడు బిల్లు సహాయంతో ప్లాటుఫారంపై ఓ డొక్కు పెట్టుకుని వ్యాపారం కొనసాగించుకొనేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. రోజువారి పళ్లు, కాయగూరలు అమ్ముకొని జీవనం సాగించేవారని తెలిపారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి- మందస

మండలంలో వివిధ గ్రామాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో హరిపురం ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు వరుసగా విజయాలు సాధించారని ప్రధానోపాధ్యాయులు జి.ఉమారాజ్ తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో విజేతలకు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల అంకితభావం, గ్రామస్తుల సహకారం తోడై విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.సాంబమూర్తి, ఎం.చక్రధరరావు, జి.తేజేశ్వరరావు, జి.రమణబాబు, జి.కోదండరావు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించామని సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య వల్ల భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు పెట్టినట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎటువంటి భారీ వాహనాలు, ట్రాక్టర్లు రావడం నిషేధమన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలో ప్రవేశం లేదన్నారు. ఈ ఆంక్షలు కాదని వాహనాలు వచ్చినట్లు జరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎల్సిస్ గేట్, దాసన్నపేట కూడళ్ల వద్ద పోలీసులను ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఈయనతో పాటు ఎస్ఐ చినంన్నాయుడు ఉన్నారు.

మెడికల్ కళాశాలలు ప్రయివేటీకరిస్తే ఆందోళన

మాజీ మంత్రి అప్పలరాజు



మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన 14 మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేయడానికి సిఎం చంద్రబాబునాయుడు కుట్రలు పన్నుతున్నారని, అదే జరిగితే తాము ఆందోళన చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హెచ్చరించారు. పలాస ప్రగతి భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలని యోచిస్తోందని విమర్శించారు. అందులో భాగంగా పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు భర్తీకి కేంద్రం అనుమతులు ఇస్తే... రాష్ట్ర ప్రభుత్వం తమకు వద్దని తిప్పి పంపించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో కొత్తగా ఒక్క మెడికల్ కళాశాలలైనా తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. 2023-24లో విజయనగరం, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల కళాశాలలు ప్రారంభమై ఒకేసారి 750 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వాహకంతో ఈ ఏడాది 700 ఎంబిబిఎస్ సీట్లు రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతన వైద్య కళాశాల విషయంలో టిడిపిప్రభుత్వ నిర్ణయం నీట్ విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన ఐదు వైద్య కళాశాలల ద్వారా 750 ఎంబిబిఎస్ సీట్లు, వచ్చే విద్యాసంవత్సరం 2025-26లో ప్రారంభించాల్సిన మరో ఏడు వైద్య కళాశాలలు పనులు నిలిచి వేయడం ద్వారా మరో 1050 ఎంబిబిఎస్ సీట్లు విద్యార్థులు కోల్పోతున్నారన్నారు.



డ్రోన్ పనిచేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

డ్రోన్లతో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి : వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు డ్రోన్లు అవసరమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేటలో తన వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ ద్వారా వరి పంటకు యూరియా, డిఏపి, ఇతర క్రిమి సంహారక మందుల పిచికారీ చేసే విధానాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే రైతులు అధిక దిగుబడి సాధిస్తారని అన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాలని, రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తద్వారా అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, ఎడి రవీంద్ర భారతి, మండల ఎఒ చిరంజీవిరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకుల నిరసన

శ్రీకాకుళం అర్బన్: గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులను ప్రభుత్వ కళాశాలల్లో విలీనం చేయాలని జిసిజిటిఎ జిల్లా అధ్యక్షులు శశిభూషన్ కోరారు. ఈ మేరకు నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వద్ద శనివారం నల్లబాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన హేతుబద్ద రహితమైన జిఒ 42ను వెంటనే రద్దు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి ఢిల్లీశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ హరిత, సైన్స్ విభాగాధిపతి పోలినాయుడు, ఆర్ట్స్ విభాగాధిపతి రామ్మూర్తి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

నేడు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురం, పోస్టాఫీస్ వీధిలో ఆదివారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వరసిద్ధి వినాయక యూత్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వరకు నలుగురు విద్యార్థులు ఒక గ్రూపుగా ఏర్పడి ఈ క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చని అన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేదని, విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేయబడతాయని తెలిపారు. వివరాలకు చరణ్ (7287920142), కళ్యాణ్ (7799676357), శ్రీనివాస్ (9014492101), పవన్ (8309572135)లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జ్ఞాన భారతి సిబిఎస్ఇ సీనియర్ సెకండరీ పాఠశాలలో రాష్ట్రీయ హిందీ దివస్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని సెక్రటరీ, సిఇఒ జోహార్ ఖాన్ అధ్యక్షతన నిశనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పాఠశాలలో హిందీ భాషకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. హిందీ పండితుడు ఎల్.చిరంజీవిరావు హిందీ భాష ప్రాధాన్యతను వివరిస్తూ... కవితలు వినిపించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు ప్రీతిశర్మ, కల్పనారెడ్డి, రిజ్వాన్, వైశాలిలను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు హిందీ గీతాలను ఆలపించి, హిందీ భాష గీతాలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్‌పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా పాల్గొన్నారు.



సన్మానిస్తున్న జోహార్ ఖాన్

సోంపేట : పట్టణంలోని వివేకానంద విద్యా కేంద్రంలో శనివారం జాతీయ హిందీ భాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మృతుని కుటుంబానికి పరామర్శ

సోంపేట : మండలంలో శారదాపురంలో కల్తీ సారాయి తాగి మృతి చెందిన కుటుంబ సభ్యులను నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు కె.వి.జగన్నాథరావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతుని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారాన్ని అందించాలన్నారు. నాటుసారాను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈయనతో వెంట బీన ఢిల్లీరావు, ఎస్.వెంకటరావు, చౌదరి లక్ష్మణరావు ఉన్నారు.

'జలజీవన్' పనులు పున:ప్రారంభం

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం పంచాయతీలో జలజీవన్ మిషన్ నిధులు ద్వారా చేపట్టిన పనులను శనివారం పున:ప్రారంభించారు. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు పనులు వేగవంతం చేయాలని వైస్ ఎంపిపి దువ్వ వివేకానందరెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి నర్తు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.





17 నుంచి స్వచ్ఛతాహీ సేవా


మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా వ్యర్థపదార్థాలు తొలగింపు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్, పంచాయతీ అధికారులు, కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎక్కువగా చెత్త పోగయ్యే బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని, పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పర్యాటక ప్రదేశాలు వంటి చోట్ల సామూహిక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం నియోజకవర్గానికి డ్రోన్ చొప్పున కేటాయిస్తున్నట్టు తెలిపారు. వీటిద్వారా పారిశుధ్య నిర్వహణ అత్యవసరమైన ప్రదేశాలను సులభంగా గుర్తించవచ్చన్నారు. అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గ్రామసభలు, సఫాయి మిత్రలు, పారిశుధ్య సిబ్బందిని సత్కరించాలన్నారు. వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు.















